




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| శుక్రవారం 08 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 340 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|


## నల్లగొండ అభివృద్ధి అంశాలపై మంత్రుల కీలక సమావేశం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 08, ప్రతినిధి: హైదరాబాద్ హిమాయత్‌నగర్ హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సమస్యలు, గృహనిర్మాణ అంశాలపై నిర్వహించిన కీలక సమావేశంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త రిజిస్ట్రేషన్ కార్యాలయం మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి కోరగా అంగీకారం లభించింది. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎదురుగా ఉన్న 70 ఎకరాల్లో కొత్త హౌసింగ్ కాలనీ కోసం మున్సిపాలిటీతో పాటు ఇతర లబ్ధిదారుల కొరకు త్వరితగతిన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో గ్రామకంఠం స్థలాల్లో ఇండ్లు కలిగిన వారికి సరైన పత్రాలు లేక ఇంటి నంబరింగ్, రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో 9,640 ఇండ్లపై సమగ్ర నివేదిక తెప్పించి సమస్య పరిష్కరించాలని కోరారు. నల్లగొండ కలెక్టరేట్ పక్కన ఉన్న 2బీహెచ్‌కే కాలనీలో 552 ఇండ్ల పెండింగ్ పనుల కోసం రూ.1 కోటి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అదనంగా జిల్లా కేంద్రంలో ఎంఆర్వో అర్బన్, ఎంఆర్వో రూరల్ కార్యాలయాల మంజూరుకు అంగీకారం లభించిందని పేర్కొన్నారు. దేవరకొండ, ఆలేరు వంటి ఎస్టీ జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో అదనపు ఇండ్లు మంజూరు చేయాలని కోరగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




## నిజాయితీతో సేవలందించి స్ఫూర్తిగా నిలవాలి




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 08, ప్రతినిధి: ఎంతో పోటీ మధ్య కష్టపడి సాధించిన గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గురువారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని, ముఖ్యంగా సమాజంలోని అత్యంత పేద ప్రజలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలవాలని కోరారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా స్వీకరించి ముందుకు సాగితే కలిగే సంతృప్తి అమూల్యమని తెలిపారు. ఆదర్శవంతమైన సేవలతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని యువ అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సొంతింటి కల సాకారం.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 08, ప్రతినిధి: ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడం, భూ యాజమానులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడానికి కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల హౌసింగ్, రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి అక్రమాలు జరిగినా ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు. ఒకసారి ప్రొసీడింగ్స్ జారీ చేసి మొదటి బిల్లు జమ అయిన లబ్ధిదారులకు తదుపరి విడతల నిధులు కూడా సకాలంలో విడుదలయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో సేకరించి వినియోగించని భూములను అర్హులైన పేదలకు ఇండ్ల పట్టాల కోసం ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా గతంలో మంజూరై పూర్తి కాలేని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించనున్నట్లు వెల్లడించిన మంత్రి, లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు ఎమ్మార్వోలను నియమించనున్నట్లు ప్రకటించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం ఉమ్మడి సర్వేలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి విస్తృత అధికారాలు కల్పించిన ఆర్డీవోలు వాటిని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.




## 10 ఏళ్లలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తాం: శ్రీధర్ బాబు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 08, ప్రతినిధి: వచ్చే పదేళ్లలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ముంబైలో నిర్వహించిన నాస్కామ్ జీసీసీ సమ్మిట్–2026లో "బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్" అంశంపై ప్రసంగించిన మంత్రి, "తెలంగాణ రైజింగ్ విజన్–2047" కింద రాష్ట్రాన్ని దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం వాటా కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ప్రపంచంలోని అనేక నగరాలు ప్రణాళిక లేని పట్టణీకరణ వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నాయని, అయితే హైదరాబాద్ అలాంటి పరిస్థితులకు గురికాకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు, మౌలిక వసతుల విస్తరణతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో రైలు విస్తరణ, కొత్త విమానాశ్రయాలు, రీజినల్ రింగ్ రోడ్, మూసీ నది పునరుద్ధరణ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకామ్ ఇన్నోవేషన్ హబ్ వంటి కీలక ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. సాంకేతికత, బ్యాంకింగ్, జీవ విజ్ఞానం, సెమీకండక్టర్లు, రక్షణ, ఎఫ్‌ఎంసీజీ, అంతరిక్ష సాంకేతికత, అతిథ్య రంగాల్లో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందని తెలిపారు. గత ఏడాది హైదరాబాద్‌లో 70కి పైగా జీసీసీలు స్థాపించబడగా, ఈ ఏడాది మరో 100 జీసీసీలు తీసుకురావడమే లక్ష్యమని, వాటి ద్వారా దాదాపు లక్ష మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. సంప్రదాయ బ్యాక్‌ఆఫీస్ కేంద్రాల నుంచి గ్లోబల్ వ్యాల్యూ సెంటర్లుగా జీసీసీలను మార్చేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పరిశ్రమల ప్రతినిధులను ఆహ్వానించిన మంత్రి, "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో భాగస్వాములు కావాలని కోరారు.



## ఖానాపూర్‌లో దేవాలయం కూల్చివేత జరగలేదు: కలెక్టర్ వివరణ

సందేశం టైమ్స్, వరంగల్, మే 08, ప్రతినిధి: ఖానాపూర్ మండలం పహాడ్ల అశోక్‌నగర్ గ్రామంలో పురాతన దేవాలయం కూల్చివేశారంటూ కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలపై జిల్లా కలెక్టర్ సత్య శారద వివరణ ఇచ్చారు. సర్వే నెం.226/1లో ఉన్న భూమిపై నర్సంపేట ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ, పురావస్తు శాఖ అధికారులు, ఖానాపూర్ తహసీల్దార్, టీజీఈడబ్ల్యూఐడీసీ ప్రతినిధులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు. పరిశీలనలో సంబంధిత భూమి దట్టమైన చెట్లు, పొదలతో నిండి ఉన్నట్లు గుర్తించారని పేర్కొన్నారు. "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్" నిర్మాణానికి భూమి చదును చేసే పనుల్లో భాగంగా పొదలను తొలగిస్తుండగా పాత శిథిలావస్థలో ఉన్న నిర్మాణ అవశేషాలు కనిపించాయని, ఎటువంటి దేవాలయాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చివేయలేదని అధికారులు స్పష్టం చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, పురావస్తు శాఖ రికార్డుల పరిశీలనలో ఈ భూమి ప్రభుత్వ భూమిగా నమోదై ఉందని, ఎండోమెంట్స్ శాఖ భూమిగా నమోదు కాలేదని వెల్లడించారు. ఈ భూమి గతంలోనే గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించబడినట్లు రికార్డుల్లో ఉందని, పురావస్తు శాఖ రికార్డుల్లో కూడా ఆ నిర్మాణం రక్షిత దేవాలయం లేదా పురావస్తు కట్టడంగా నమోదు కాలేదని తెలిపారు. సంయుక్త పరిశీలన బృందం అభిప్రాయం ప్రకారం ఆ నిర్మాణం చాలా కాలంగా శిథిలావస్థలో ఉండి చెట్లు, పొదల మధ్య కనిపించకుండా పోయిందని తేలిందన్నారు. అందువల్ల రక్షిత దేవాలయం లేదా పురావస్తు కట్టడాన్ని ధ్వంసం చేసిన ఘటన జరగలేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, నర్సంపేట ఎమ్మెల్యే కలిసి స్థలాన్ని సందర్శించి చరిత్రకారులు, స్థపతులు, పురావస్తు శాఖ అధికారులతో సంప్రదించి ఆ నిర్మాణాన్ని అదే ప్రాంతంలో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే దేవాలయానికి పురావస్తు శాఖ గుర్తింపు వచ్చేలా కూడా ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు, మీడియా ప్రతినిధులు వాస్తవాలు తెలుసుకుని మాత్రమే వార్తలను ప్రచారం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# కార్పొరేట్ కళాశాలల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 08, ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల నుంచి 2026-27 విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఎంసెట్, ఐఐటీ/జేఈఈ, ఏఐఈఈఈఈ ప్రవేశ పరీక్షల శిక్షణ అందించేందుకు కార్పొరేట్ కళాశాలల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారిణి కె. దయానంద రాణి తెలిపారు. ఆసక్తి గల జూనియర్ కళాశాలల యాజమాన్యాలు తెలంగాణ ఈపాస్ అధికారిక వెబ్‌సైట్� లో మే 11, 2026 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రతితో పాటు కళాశాల సంబంధిత పత్రాలను జతచేసి సూర్యాపేట ఐడీఓసీ మొదటి అంతస్తులోని రూమ్ నెం.ఎఫ్-3 కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. మే 18, 2026లోపు ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

# విద్యార్థుల ఆధార్ నమోదుకు సమ్మర్ క్యాంపులు




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 08, ప్రతినిధి: పాఠశాలల్లో నమోదైన ప్రతి విద్యార్థికి ఆధార్ గుర్తింపు తప్పనిసరి కావడంతో ఆధార్ కార్డు లేని విద్యార్థుల నమోదు, తప్పుల సవరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సూర్యాపేట జిల్లాకు ఎస్ఎస్ఆర్ ఆధార్ ఏజెన్సీని నియమించి ఆధార్ కిట్ ద్వారా పాఠశాలల వద్దే విద్యార్థుల ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇంకా ఆధార్ నమోదు కాని లేదా సవరణ అవసరమున్న విద్యార్థుల కోసం మండల వనరుల కేంద్రాలు (ఎంఆర్సీలు)లో ప్రత్యేక సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని రాష్ట్ర పథక సంచాలకులు సూచించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి మండల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసి, తమ మండల పరిధిలోని విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారా సమాచారం అందించి ఆధార్ సమ్మర్ క్యాంపులను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని



# స్వీయ గణనకు మరో మూడు రోజులే గడువు

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 08, ప్రతినిధి: స్వీయ గణన చేసుకునేందుకు ఇంకా కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఉన్నందున జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, ఐటీ రంగ నిపుణులు సహా అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. జనగణనలో భాగంగా నిర్వహిస్తున్న 'గృహ లెక్కింపు మరియు గృహ పరిస్థితుల లెక్కింపు' కోసం ప్రజలు తమ ఇంటి, కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం మే 10 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సదుపాయం ఉన్న ఏ పరికరం ద్వారానైనా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ జనగణన స్వీయ గణన పోర్టల్� ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ఇంకా వివరాలు నమోదు చేయని వారు వెంటనే నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# గ్రామీణ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

సందేశం టైమ్స్, నల్గొండ, మే 08, ప్రతినిధి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా� గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఎస్‌బీఐ–ఆర్‌సెటి) ఆధ్వర్యంలో నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన నిరుద్యోగ గ్రామీణ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ తెలిపారు. శిక్షణతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 19 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ గ్రామీణ మహిళలు మే 13, 2026లోపు నల్గొండ రాంనగర్‌లోని ఎస్‌బీఐ–ఆర్‌సెటి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9701009265 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



# వాయిలసింగవరంలో ఉపాధి హామీ పనుల తనిఖీ



సందేశం టైమ్స్, అనంతగిరి, మే 08, ప్రతినిధి: అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మండల ఎంపీడీవో హరిసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల వద్ద కూలీల హాజరు నమోదు, మస్టర్ రోల్స్ నిర్వహణ, వేతనాల చెల్లింపుల స్థితి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు ఖచ్చితంగా అమలు కావాలని స్పష్టం చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కూలీలకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పనుల పర్యవేక్షణలో గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పని ప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేయడం, చల్లని తాగునీరు అందించడం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం వంటి చర్యలు తీసుకోవడంపై సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సౌమ్యలను అభినందించారు. ఈ చర్యలు కూలీల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. కూలీలతో మాట్లాడిన ఎంపీడీవో వారికి అందుతున్న వేతనాలు, పని పరిస్థితులు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తెలియజేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు స్థిరమైన ఉపాధి కల్పించడమే లక్ష్యమని, పనులు పారదర్శకంగా, నాణ్యతతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే పనులు నిర్వహించాలని కూలీలకు సూచించినట్లు తెలిపారు. పనుల వద్ద ఫోటో హాజరు విధానం అమలులో భాగంగా ప్రతి 40 నుంచి 50 మంది కూలీలకు మొబైల్ నిర్వహణ తెలిసిన చదువుకున్న వ్యక్తిని నియమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, వార్డు సభ్యులు ప్రవీణ్, నాగరాజు, మేట్ల సంఘం నాయకుడు కొల్లు సుబ్బారావు, మాజీ వార్డు సభ్యురాలు కొల్లు స్వప్న శ్రీకాంత్, ఆశా కార్యకర్త జి. మరియమ్మతో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# సాకి చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులకు శ్రీకారం



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 08, బి. డేవిడ్: పటాన్చెరు రహదారి పక్కన ఉన్న సాకి చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను సుమారు రూ.70 లక్షల అంచనా వ్యయంతో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పలువురు నాయకులతో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ సాకి చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క కారణంగా చెరువు మురికిమయంగా మారడంతో పాటు చేపలు, ఇతర జీవరాశులకు ఆక్సిజన్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. మత్స్యకారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి చెరువును శుభ్రపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సప్పన్నదేవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, తప్పు కుమార్, జలగరి ఎట్టయ్య, నాగసాని సత్తయ్య, కొమరంగూడెం వెంకటేష్, కోమటి రాము తదితరులు పాల్గొన్నారు.

# పోసానిపేటలో చలివేంద్రం ప్రారంభం



సందేశం టైమ్స్, అందోల్ మండలం, మే 08, ప్రతినిధి: అందోల్ మండలం పోసానిపేట గ్రామంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద గ్రామ ప్రజల దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు చల్లని తాగునీటి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, గ్రామ ప్రజలకు తాగునీరు అందించడం ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు. గ్రామంలో ప్రజా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన వారిని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో పరిశ్రమల భాగస్వామ్యం పెరగాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 08, బి. సంగమేశ్వర్: గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో హెట్రో పరిశ్రమ సౌజన్యంతో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు అంతస్తుల నిర్మాణ పనులకు, అలాగే పశువుల ఆసుపత్రిలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో రూ.33 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదుల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన పరిశ్రమల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# లాభదాయకమైన పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 08, కె. సంగమేశ్వర్: ప్రస్తుత మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు డిమాండ్ ఉన్న, లాభదాయకమైన పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో గురువారం పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో వ్యవసాయ, విద్యుత్, రెడ్‌కో శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మార్కెట్ అవసరాలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం చేయాలని సూచించారు. వ్యవసాయంలో విలువ ఆధారిత ఉత్పత్తులపై కూడా రైతులు దృష్టి పెట్టాలని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని రైతులు నిరంతర ఆదాయం పొందేలా ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు లాభదాయకమైన పంట అని, ప్రభుత్వం 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నందున రైతులు ఈ పంట సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న డ్రోన్లు, కట్టర్లు, స్ప్రేయర్లు వంటి పరికరాల వినియోగంపై అధికారులు ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జహీరాబాద్, సదాశివపేట, వట్‌పల్లి ప్రాంతాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరగా, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ, విద్యుత్, రెడ్‌కో శాఖల అధికారులు, ఏవోలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



# 30 ఏళ్లుగా అంబలితో ప్రజల దాహం తీరుస్తున్న వెల్డింగ్ మణయ్య

సందేశం టైమ్స్, జోగిపేట, మే 08, అందోల్ నియోజకవర్గ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేట పట్టణంలో ప్రతి వేసవిలో ప్రజలకు అంబలి పంపిణీ చేస్తూ సేవాభావంతో ముందుంటున్న వ్యక్తిగా వెల్డింగ్ మణయ్య ప్రశంసలు అందుకుంటున్నారు. గత 30 సంవత్సరాలుగా నిరంతరంగా అంబలి పంపిణీ చేస్తూ ప్రజల దాహాన్ని తీర్చడం విశేషమని స్థానికులు పేర్కొంటున్నారు. రాగి, జొన్న లేదా బియ్యంతో తయారయ్యే అంబలి శరీరానికి చల్లదనాన్ని అందించడంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అంబలిలో పెరుగు, ఉల్లిపాయ, పచ్చిమిర్చి కలిపి తాగితే మరింత రుచిగా ఉండటంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుందని ప్రజలు చెబుతున్నారు. వేసవి తాపాన్ని తగ్గించే సహజ ఆరోగ్యకర పానీయంగా అంబలి ప్రజాదరణ పొందుతుండగా, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలు కూడా మణయ్య ఏర్పాటు చేసిన అంబలి కేంద్రానికి చేరుకుని సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రజాసేవ భావంతో కొనసాగిస్తున్న ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 08, కె. సంగమేశ్వర్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే ట్రక్ షీట్లు జనరేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ కొనుగోళ్లలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిల్లర్లు కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఖచ్చితంగా దింపుకోవాలని, ధాన్యం స్వీకరించిన అనంతరం మిల్లర్ల నుంచి అంగీకార పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం కొలిచే యంత్రాలు, గన్ని బ్యాగులు, తార్పాలిన్లు సరిపడా అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు నిర్ణీత గడువులోగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లలో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీతతో పాటు జిల్లా పౌరసరఫరాల అధికారి, డీఎం సివిల్ సప్లై, డీఆర్‌డీవో, మార్క్‌ఫెడ్, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

# షేర్ రామిరెడ్డి గూడెంలో ఘనంగా ప్రధానం కార్యక్రమం



సందేశం టైమ్స్, చౌటకూరు, మే 08, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం షేర్ రామిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎర్ర నాగభూషణం కుమార్తె ప్రధానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ మల్లేశం, ఖాదీరాబాద్ గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జగన్‌తో పాటు శ్రీనివాస్, జగదీశ్, మల్లేశం, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# నిధులు లేక కార్పొరేషన్లు నిర్వీర్యం: రమేష్ గౌడ్




సందేశం టైమ్స్, తెలంగాణ, మే 08, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో 17 కార్పొరేషన్లకు చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌ల నియామకాలపై చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్ రమేష్ గౌడ్ స్పందిస్తూ, తగిన నిధులు లేకపోతే ఈ నియామకాల వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి ఏడాది బడ్జెట్‌లో కార్పొరేషన్లకు అతి తక్కువ నిధులు కేటాయించి, వాటిని కూడా పూర్తిగా విడుదల చేయకపోవడం వల్ల వృత్తిదారుల సంక్షేమం దెబ్బతింటోందన్నారు. ఇప్పటికే వృత్తుల ఆధారంగా ఏర్పాటు చేసిన పలు కార్పొరేషన్లు, ఫెడరేషన్లు నిధుల కొరతతో నిర్వీర్యం అవుతున్నాయని, సిబ్బందికే పనిలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కొత్తగా నియమితులైన చైర్మన్‌లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2026-27 బడ్జెట్‌లో కేటాయించిన నిధులను తక్షణమే విడుదల చేసి వృత్తిదారుల ఉపాధి, ఆధునీకరణకు వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




# మహిళల రక్షణకు భరోసా సేవలు ఆదర్శం: ఎస్పీ పరితోష్ పంకజ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 08, ప్రతినిధి: పోక్సో, అత్యాచార కేసుల్లో బాధిత మహిళలు, బాలికల భద్రతకు "భరోసా" కేంద్రం కీలక పాత్ర పోషిస్తున్నదని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. భరోసా 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా భరోసా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిర్భయ ఘటన అనంతరం వర్మ కమిటీ సిఫార్సుల మేరకు 2016లో హైదరాబాద్‌లో భరోసా కేంద్రం ప్రారంభమైందని గుర్తుచేశారు. గత పదేళ్లుగా బాధితులకు వైద్య, న్యాయ, కౌన్సెలింగ్ సేవలను ఒకే వేదికపై అందిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ బాధితులు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా భరోసా సిబ్బంది వారి వద్దకే చేరుకుని సహాయం అందిస్తున్నారని తెలిపారు. మహిళలపై నేరాలను అరికట్టేందుకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఇన్స్పెక్టర్ రాము నాయుడు, ఎస్ఐ పూలబాయ్, కోఆర్డినేటర్ దేవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ వినియోగంపై యూఐడీఏఐ స్పష్టత.. ఉచిత బస్ పథకాలలో అయోమయం




సందేశం టైమ్స్, మే 08, ప్రతినిధి: ఆధార్ కార్డు వినియోగంపై యూఐడీఏఐ కీలక స్పష్టత ఇచ్చింది. ఆధార్ లెటర్, ఈ-ఆధార్, పీవీసీ కార్డు, ఎం-ఆధార్ యాప్ రూపంలో ఉన్న ఆధార్ అన్నీ సమానంగా చెల్లుబాటు అవుతాయని పేర్కొంది. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు సహా అన్ని సంస్థలు వీటిని గుర్తింపు పత్రాలుగా అంగీకరించాలని సూచించింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు అమలవుతున్న ఉచిత బస్ పథకాలలో మాత్రం ఫిజికల్ ఆధార్ కార్డు తప్పనిసరిగా కోరుతున్నారని మహిళలు చెబుతున్నారు. ఫోన్‌లో ఎం-ఆధార్ చూపించినా అనుమతించాలని ప్రయాణికులు కోరుతుండగా, ఈ అంశంపై ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## జోగిపేటలో ఘనంగా వాడపల్లి సంగమేశ్వర్ కుమారుని వివాహ మహోత్సవం



సందేశం టైమ్స్, అందోల్ మండలం, మే 08, ప్రతినిధి: అందోల్-జోగిపేట పురపాలక సంఘ పరిధిలోని రెండో వార్డుకు చెందిన వాడపల్లి సంగమేశ్వర్ కుమారుని వివాహ మహోత్సవం జోగిపేట పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాలనీవాసుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుక ఆనందోత్సాహాల నడుమ కొనసాగింది. ఈ వివాహ వేడుకకు అందోల్-జోగిపేట పురపాలక సంఘ కో-ఆప్షన్ సభ్యురాలు పిట్ల భాగ్యలక్ష్మి లక్ష్మణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే వార్డు సభ్యులు కొత్తపల్లి యాదగిరి, పడిగే శివశంకర్, బూరుగుపల్లి శివకుమార్, పిట్ల మల్లేశం, డాకూరి ప్రభాకర్, వాడేపల్లి పెంటయ్య, గొంగులూరు శ్రీనివాస్, చౌదర్పేట ప్రభాకర్ తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు వరుని తల్లిదండ్రులను అభినందిస్తూ కొత్త జంట సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులు భోజన తాంబూలాలు స్వీకరించి కుటుంబ సభ్యులకు శుభాభినందనలు తెలియజేశారు. “సర్వేజనా సుఖినోభవంతు” సందేశంతో కార్యక్రమం సంతోషకర వాతావరణంలో ముగిసింది.

## దాడులపై కేటీఆర్ ఆగ్రహం.. బండి సంజయ్‌పై విమర్శలు




సందేశం టైమ్స్, కరీంనగర్, మే 08, ప్రతినిధి: కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయం, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై జరిగిన దాడులపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, కార్యాలయంపై దాడి చేయడం దుర్మార్గమని ఖండించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్పై విమర్శలు గుప్పించారు. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం సిగ్గుచేటని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## ఈ నెల 13 నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

సందేశం టైమ్స్, తెలంగాణ, మే 08, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 13 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తెలిపారు. హాల్ టికెట్లను గురువారం విడుదల చేసి మొదట కాలేజీల లాగిన్‌లో అందుబాటులో ఉంచి, అనంతరం విద్యార్థుల వాట్సాప్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ పరీక్షలకు మొత్తం 3,97,997 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించగా, వోకేషనల్ విభాగంలో 28,703 మంది నమోదు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు ప్రతిరోజూ రెండు సెషన్లలో జరుగుతాయని, ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## హల్దీ వాగులో విషాదం.. స్నానానికి దిగి ముగ్గురు యువకుల మృతి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 08, ప్రతినిధి: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం శివారులోని హల్దీ వాగులో స్నానానికి దిగిన ముగ్గురు యువకులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్ (27), వికాస్ (27), ఆనంద్ రెడ్డి (27)గా మృతులను పోలీసులు గుర్తించారు. వీరంతా స్నేహితులుగా సమాచారం. తూప్రాన్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరైన అనంతరం తిరుగు ప్రయాణంలో హల్దీ వాగు వద్ద ఆగి స్నానం చేసేందుకు దిగగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీసి దర్యాప్తు చేపట్టారు.

## వ్యవసాయంలో టెక్నాలజీని వినియోగించుకోవాలి: అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 08, ప్రతినిధి: వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకుని రైతులు అధిక దిగుబడులు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. కొల్చారం మండలం పోతన శెట్టిపల్లిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రైతు వరము సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మన దేశం వ్యవసాయ ఆధారిత దేశమని, రైతులు వ్యవసాయంలో నూతన వంగడాలు, పనిముట్లు, యంత్రాలను వినియోగించి పంటల ఉత్పత్తిని పెంచాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటే వ్యవసాయం మరింత లాభదాయకంగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, స్థానిక తహసీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా తిరిగి దుర్గారెడ్డి ఎన్నిక



సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, అల్లాదుర్గం, మే 08, ప్రతినిధి: కుమార్. అల్లాదుర్గం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా గడి పెద్దాపూర్ గ్రామానికి చెందిన ఎస్ దుర్గారెడ్డి గారు తిరిగి ఎన్నికయ్యారు. గతంలో కూడా ఆయన అదే పదవిలో పనిచేసి రైతులకు సేవలు అందించగా, ఇప్పుడు మళ్లీ ఆయనకే అవకాశం కల్పిస్తూ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నిక అనంతరం దుర్గారెడ్డిగారిని సంఘ సభ్యులు శాలువాతో సత్కరించి ఘనంగా అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలను స్వీకరించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం డిమాండ్ – మే 11న కలెక్టరేట్ ముందు ధర్నా




సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మే 08, ప్రతినిధి: సంతోష్. మెదక్ జిల్లా కేవల్ కిషన్ భవన్లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ మల్లేశం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం అడివయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వరి, మొక్కజొన్న, జొన్నల కోతలు ప్రారంభమైనప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తక్షణం ప్రారంభించకపోవడం రైతులపై తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. మెదక్ జిల్లాలో కోతలు ప్రారంభమై 20 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు పంటను అమ్ముకుంటున్నారని ఆయన తెలిపారు. అలాగే తేమ శాతం నిబంధనలు, బరువు తారుమారు, మౌలిక సదుపాయాల లోపం, వర్షాల కారణంగా వడ్లు తడవడం వంటి సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, దళారులను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై నిరసనగా మే 11న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కె. నాగరాజు, ఏ. మహేందర్ రెడ్డి, కె. మల్లేష్, బలమని, సంతోష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రూ.37.01 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 08, ప్రతినిధి: మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, జర్నలిస్టుల కాలనీతో పాటు పట్టణంలోని అన్ని ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. గురువారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో సుమారు రూ.37.01 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం మెదక్ పట్టణాన్ని అభివృద్ధి చేయడమేనని, సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నామని తెలిపారు. పట్టణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, స్లాబ్ నిర్మాణాలు, కమ్యూనిటీ హాళ్లు, వసతి గృహాలు వంటి పలు పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వార్డు నంబర్లు 1, 2, 3, 5, 6, 7, 12, 13, 14, 19, 28 తదితర ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించగా, జర్నలిస్టుల కాలనీలో కూడా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 170 గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ – ఆవుల రాజిరెడ్డి





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, మే 08, ప్రతినిధి: నేడు వెల్దుర్తి మండలం బాలాజీ గార్డెన్స్‌లో మండలానికి చెందిన 170 మంది గర్భిణీ స్త్రీలకు మాతృదేవోభవ న్యూట్రిషన్ కిట్లను రాజన్న ఫౌండేషన్ చైర్మన్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గారు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, పోషకాహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని, తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అనంతరం మన్నే వారి జలాల్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.